ఎల్ఆర్ఎస్ సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 9:ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన సందేహాలు ఉంటే నివృత్తికి కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు.కాల్ సెంటర్ నంబర్ 9492409781 ద్వారా ఎల్ఆర్ఎస్ సంబంధించి ఎలాంటి సహాయం అయినా పొందవచ్చున్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా సాధికారతకు కృషి

బోడుప్పల్, మార్చి 9: మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంభనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉప్పల్ డిపో డిపో టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వంద మంది మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, యూటీఏ నాయకులు శ్రీనివాస్, వనజ , మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతాం

కృష్ణానగర్ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ జె.ప్రభుదాస్

మల్లాపూర్, మార్చి 9 : మీర్‌పేట్ హెచ్‌బీకాలనీడివిజన్ పరిధిలోని కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ జే. ప్రభుదాస్ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో పర్యటించి పలు సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఆయన కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో , కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి దేవరాజ్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బ్రహ్మచారి, ఎం ఎస్ ఎన్ మూర్తి, శ్రీనివాస్, జయమ్మ, సుజాత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిన హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత

హయత్‌నగర్, మార్చి 9: ఆటోలో మర్చిపోయిన హ్యాండ్‌బ్యాగ్‌లో విలువైన బంగారు నగలు, నగదును తిరిగి వారికి అప్పగించిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వీరసత్య మల్లేశ్, భార్య శ్రీసూక్తతో కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి హయత్‌నగర్ సూర్యనగర్‌లో ఉండే స్నేహితుడు శరత్‌చంద్ర ఇంటికి బయల్దేరారు. హయత్‌నగర్‌లో బస్సు దిగి ఆటోలో సూర్యనగర్‌కు వెళ్లారు. ఆటోలో హ్యాండ్‌బ్యాగ్ మర్చిపోయారు. వెంటనే హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించి బ్యాగు, బంగారు నగలు రూ.14 వేలు నగదును అప్పగించారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా:ఎమ్మెల్యే

కృష్ణారెడ్డినగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, మార్చి 9 : ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డినగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కృష్ణారెడ్డినగర్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, డివిజన్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్ నాయక్, సురేశ్‌నాయక్, నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, సీసీఎస్ అధ్యక్షుడు ఎంపెల్లి పద్మారెడ్డి, శంకర్‌నాయక్‌లతో పాటు కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సార్ గురుకుల్‌ను పరిరక్షించండి

సీఎంకు పోస్ట్‌కార్డులు పంపుతున్న గురుకుల్ విద్యార్థినులు.

ఘట్ కేసర్, మార్చి 9: ముఖ్యమంత్రి గారు మా గురుకుల విద్యాలయాన్ని పరిరక్షించి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ విద్యాలయ పూర్వ విద్యార్థినులు ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డికి ఆదివారం పోస్ట్ కార్డులు పంపించారు. మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ చేపట్టిన సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమంలో భాగంగా గురుకుల్ విద్యార్థినులు పోస్ట్ కార్డుల ద్వారా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు పోస్టు కార్డులను పంపించారు. పోస్ట్ కార్డులు పంపించిన వారిలో గురుకుల విద్యార్థినులు ఆర్.గిరిజ, ప్రజ్ఞ, పావని, నవ్య సుష్మ పూర్వ విద్యార్థులు కంది ప్రేమ్, కుమార్, ఆంజనేయులు, శశిధర్, ఇమ్ము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ధీర' పుస్తకం ఆవిష్కరణ

రామంతపూర్,మార్చి 9 : జేవీపబ్లికేషన్స్ ప్రచురణకర్త జ్యోతి వలబోజు నిర్వహణలో రూపొందించిన 126 మంది ధీరల కథల "ధీర" పుస్తకాన్ని ఉప్పల్‌లోని ఐఫోకస్ మిషన్ సుజనాలయలోఆదివారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జలంధర చంద్రమోహన్, మంథా భానుమతి, డా. మంజుల అనగాని, గంటి భానుమతి. స్వాతి శ్రీపాద, రచయిత్రి కార్టూనిస్ట్ నెల్లుట్ల రమాదేవి, కొండపల్లి నీహారిణి తదితరులు పాల్గొన్నారు.

ధీర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు.

లైంగికదాడి బాధితురాలికి సంఘీభావం

నాచారంలో నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామంతాపూర్,మార్చి 9: సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆశవర్కర్‌పై జరిగిన లైంగికదాడి ఘటన బాధితురాలకు సంఘీభావంగా నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాచారం కార్యదర్శి పి.గణేశ్ మాట్లాడుతూ గతనెల 27వ తేదీ దళిత ఆశవర్కర్ విధులు ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో కొంతమంది దుర్మార్గులు ఆమెపై లైంగికదాడి చేయడం జరిగిందని, అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా ఆ దుర్మార్గులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారని అన్నారు. దళిత మహిళలు అంటే ప్రభుత్వానికి చిన్న చూపు అని విమర్శించారు. ఆ దుర్మార్గులపై కఠిన శిక్షలు పడేలా కేసులు పెట్టాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజ్ నరేశ్, నరసింహఎల్లేశ్,మల్లేశ్ ,చిన్న ,ప్రభాకర్ ,శ్రీనివాస్,వెంకట్, కనకయ్య కుమార్ ఉన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి

మేడ్చల్, మార్చి 9 : లక్ష్య సాధనకు శ్రమించాలని సీఐ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ శైలజాహరినాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ పట్టణంలో పాపారాయ విద్యానికేతన్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం మండల అధ్యక్షుడు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సభ్యులు రమేశ్, పాండు, పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐ సత్యనారాయణ, నాయకులు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

బోడుప్పల్: అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, సంజీవరెడ్డి

బోడుప్పల్, మార్చి 9: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీలో ఆదివారం జరిగిన గాయత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, స్థానిక నాయకులు రామచంద్రారెడ్డి, చక్రపాణి గౌడ్, ఆలయ నిర్వాహకులు, మరియు కీర్తన్ రెడ్డి, సత్యం రెడ్డి శ్రీనివాస్, నర్సింగ్‌నాయక్ కాలనీవాసులు ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ...

పోచారం: పోచారం మున్సిపాలిటీ కాచివానిసింగారం గ్రామంలోని రేణుకాఎల్లమ్మ, మల్లికార్జున స్వామి నూతన ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఘనంగా గ్రామస్తులుస్వాగతం పలికారు.అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రతమ్, నాయకులు వజ్రేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి,ఎం.భద్రారెడ్డి, ఆలయన కమిటీ అధ్యక్షుడు రాములు గౌడ్,సభ్యులు పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వేలాదిగా తరలి వచ్చి ఆలయంలో పూజలు జరిపి బోనాలను సమర్పించారు.

విశ్వబ్రాహ్మణులను ఐక్యం చేస్తాం

ఉప్పల్ నియోజకవర్గంలోని పది డివిజన్ల విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

రామంతపూర్,మార్చి9: ఉప్పల్ నియోజకవర్గంలో విశ్వబ్రాహ్మణులను ఒక తాటిపై తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని సంఘం ప్రతినిధులు అన్నారు.ఆదివారం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వారి కమిటీ కొక్కొండ బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని పది డివిజన్ల అధ్యక్ష కమిటీలను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ వేములవాడ మదన్మోహన్ చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్బోజు భిక్షపతి చారి హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో సంఘం కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గ్రేటర్‌లోని ప్రతి డివిజన్లో సంఘాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు విష్ణు చారి ,గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి,కోశాధికారి శ్రీనివాస్‌చారి , ప్రచార కార్యదర్శిరాములు చారి, ఉప్పల్ కోశాధికారి గోపి చారి గారు గ్రేటర్ హైదరాబాద్ మహిళా ప్రధాన కార్యదర్శి కవితా చారి డివిజన్ అధ్యక్ష కమిటీలు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే గ్రూప్స్ ఫలితాలు వెల్లడించాలి

కీసరలోనిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కీసర, మార్చి 9:మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.ఏబీసీడీ వర్గీకరణ పూర్తి స్థాయిలో చేయకుండా గ్రూప్స్ పరీక్ష ఫలితాలు విడుదల చేయడం సరికాదని ప్రభుత్వ పనితీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నేతలు తీవ్ర నిరసనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకొని మాదిగ ఉపకులాల జనాభా నిష్పత్తిని పరిగణలోకి తీసుకొన్న తరువాతనే గ్రూపు ఫలితాలను విడుదల చేయాలని లేదంటే మాదిగల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మహేందర్, మండల మహిళా అధ్యక్షురాలు సుజాత, మాజీ ఎంపీపీ సుజాత, ఎమ్మార్పీఎస్ నాయకులు గణేశ్, శ్రీనివాస్, సుదర్శన్, మల్లేశ్, విజయ్, పరమేశ్, నర్సింగ్‌రావు, కిరణ్, శంకరయ్య,మధుబాబు, కిశోర్ పాల్గొన్నారు.

50 ఏండ్ల తరువాత కలిశారు..

కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేడ్చల్, మార్చి 9 : వారంతా 50 ఏండ్ల క్రితం మేడ్చల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. 1975లో 10వ తరగతి పూర్తి చేసుకొని, తర్వాత చదువు, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయం ఎవరికి నచ్చిన బాటలో వారు పయనించి, స్థిర పడ్డారు. 50 ఏండ్ల తర్వాత జడ్పీహెచ్ఎస్ చెట్టు నీడలో ఒకసారి కలవాలని సంకల్పించారు. సామాజికమాధ్యమం, చరవాణి సహాయంతో అప్పుడు చదివిన విద్యార్థులు ఏకమయ్యారు. అప్పట్లో చదువు చెప్పిన గురువును కలిశారు. ఆదివారం పాఠశాలలో రీయూనియన్‌పేరుతో స్వర్ణోత్సవసంబురాలను ఘనంగా జరుపుకున్నారు. అప్పటి, ఇప్పటి పరిస్థితులను బేరీజు వేసుకొని, కష్ట సుఖాలు పంచుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. మొత్తం 62 మంది విద్యార్థుల్లో 16 మంది మృతి చెందగా, 39 మంది కలుసుకున్నారు. అప్పుడు చదువు చెప్పిన ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి గారు, మల్లా రెడ్డి గారు, ప్రభాకర్ రెడ్డి , యాదగిరి , స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో షెడ్ నిర్మాణానికి రూ.లక్ష చెక్ రూపంలో అందజేశారు.

జాబ్ మేళాకు అపూర్వ స్పందన

కీసర, మార్చి 9: కీసరలోని కల్యాణ మండపం వద్ద ఆదివారం ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేశ్ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి సుమారుగా 100కు పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వారిలో నుంచి సుమారుగా 60 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

న్యూరల్ ఏఐతో.. స్మార్ట్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్

కొండాపూర్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో న్యూరల్ ఏఐ గవర్నెన్స్ సమ్మిట్ –2025ను ఆదివారం భారత్ లైట్ హౌస్ (బీఎల్‌హెచ్) నిర్వహించింది. ప్రజా పరిపాలనను న్యూరల్ ఏఐ గవర్నెన్స్ ఎలా మార్చగలదో, అధికారులు, విధాన నిర్ణేతలు, ఏఐ ఆలోచనా నాయకులు, వ్యవస్థాపకులను సదస్సు ఒకే చోటకు చేర్చింది. భారత్ లైట్ హౌస్ వ్యవస్థాపకుడు, సీఈఓ మోహన్‌కుమార్ కె.ఆర్., సహ వ్యవస్థాపకురాలు దీప్తి గనుగపెంట ఆధ్వర్యంలో సమ్మిట్ నిర్వహించారు. మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. న్యూరల్ ఏఐ గవర్నెన్స్ ప్రభుత్వ కార్యకలాపాలలో సామర్థ్యం, భద్రత, పారదర్శకతను పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. అత్యున్నత ప్రమాణాలతో డేటా భద్రతను కొనసాగిస్తూ, ప్రభుత్వాలకు నిర్ణయాలు తీసుకోవడానికి బలమైన కార్యాచరణను సృష్టించడం తమ లక్ష్యం అన్నారు. ఓపెన్ –సోర్స్ ఎల్ఎల్ఎంల కాకుండా, పరిష్కారాలను ప్రభుత్వ నియంత్రణలో మౌలిక సదుపాయాలలో ఉన్న డేటాతో పొందవచ్చు అని చెప్పారు. సమావేశంలో ఎంపీ (రాజ్యసభ) అయోధ్యరామిరెడ్డి ఆళ్ల, వ్యాపారవేత్త సందీప్ బుర్చండి, బీసీ దళ్ జా తీయ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త దుంద్ర కుమార స్వామి, సామాజిక వ్యవస్థాపకులు మాలతి జయవేలు, ఐటీఐ హైదరాబాద్‌జనరల్ మేనేజర్ గౌరబ్ ధార్ పాల్గొన్నారు.

అలరించిన నాట్యప్రదర్శన

కొండాపూర్, మార్చి 9 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఒడిసీ, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. బెంగళూరు నుంచి విచ్చేసిన ఒడిసీ గురువులు డాక్టర్ మనసి పాండ్య రఘునందన్ తన శిష్యురాలు సంహితతో కలిసి పంచదేవి కృతి, పల్లవి, బాటు, దుర్గ, మోక్షం అంశాలను, వైదేహి సుభాష్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనలో సకలగణాధిపతి, పుష్పాంజలి, నటేశకౌతం, పిబరే రామరసం, కీర్తన, తిల్లాన అంశాలను మనస్విని, మోక్షిత, మీనాక్షి, పావిక, నిహారిక, అవిజ్ఞ , హరిణి, కార్తీక ప్రదర్శించి మెప్పించారు.

సామాజిక వాస్తవికత వైపేఆధునిక తెలుగు సాహిత్య పయనం

కొండాపూర్, మార్చి 9: అర్ధ శతాబ్దపు ఆంధ్రాకవిత్వం ప్రగతిశీల మార్గంలో నడిచిందని, 1910 నుంచి 1960 వరకు కొందరు కవులు సంప్రదాయ పద్యకవిత్వాన్ని అనుసరించినా గురజాడ, కృష్ణశాస్త్రి, కాళోజీ, దాశరథి, శ్రీశ్రీ వంటి వారు సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే రచనలే చేశారని శ్రీపాద గోపాలకృష్ణమూర్తి తన గ్రంథంలో వివరించారని హెచ్‌సీయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాలం ద్వారా ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నా రు. సమావేశానికి అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అధ్యక్షత వహించారు. దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగులో భారతీయ అలంకార సిద్ధాంతాలు, సాహిత్య విమర్శ సూత్రాలతో తన రచన కొనసాగుతుందని, లండన్ లో ఫిజిక్స్ లో డాక్టరేట్ సాధించినా, ఆయన లోతైన సాహిత్య విమర్శను చేశారని, ఆధారం లేకుండా ఏ ప్రకటననూ చేయరని సోదాహరణంగా వివరించారు. తెలుగులో ఆధునికతా, నవ్యకవిత్వం అనేది ఒక్కసారిగా, ఒక వ్యక్తి పరంగా రాలేదని, భారత జాతీయ ఉద్యమం సంస్కరణ ఉద్యమం వంటి వాటి ప్రభావాలు భారతీయ దేశంలో ఆధునికతకు కారణమయ్యాయని, అదే తెలుగు సాహిత్యంలో కూడా ప్రతిబింబించిందని శ్రీపాద కృష్ణమూర్తి తన గ్రంథంలో నిరూపించారని విశ్లేషించారు. అనేకమంది ఈ సమావేశంలో అరసం రాష్ట్ర సభ్యులు ఆనంద్, డా. శివప్రసాద్, రచయితలు, రచయిత్రులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 90 మందికి కంటి, రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం వ్యవస్థాపక సభ్యులు గోపాస్ రవీందర్, శ్రీధర్ పంతులు, కే. వెంకటేశ్, గోపాస్ చంద్రశేఖర్, కురమయ్య, శ్రీరామ్, సంతోష్, సాయి, వాసన్ ఐ కేర్ సంస్థ సభ్యులు శివ, బాలు పాల్గొన్నారు.

విద్యార్థులు సరికొత్త పరిశోధనలు చేయాలి

బడంగ్‌పేట్, మార్చి 9: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని మాటూరి వెంకట సుబ్బారావు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం బూట్‌క్యాంప్, హ్యాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు కృత్రి మ మేధస్సు ఆధారంగా చేసిన ట్రిబ్యూట్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఎంవీఎస్సార్‌లోని శాస్త్రవేత్తలు వాయిస్ మోడలింగ్, న్యూరల్ నెట్‌వర్క్‌లు, డీప్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతను వినియోగించారు. కార్యక్రమంలో సాయిసతీశ్(సీఈఓ, ఇండియన్ సర్వీస్), రాజీవ్ రంజన్(విప్రో), కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయ, చైర్మన్ పీవీఆర్ కాశ్యప్, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీజీ,ప్రొఫెసర్ ప్రసన్నకుమార్,కన్వీనర్ డాక్టర్ ఏవీ కృష్ణప్రసాద్,కన్వీనర్ ప్రొఫెసర్ సీత సౌజన్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

బోడుప్పల్: మహిళా దినోత్సవాన్ని చెంగిచర్లక్రాంతి కాలనీలో మహిళా అధ్యక్షురాలు ఇందిర,కాలనీ అధ్యక్షుడు ఎల్లేశ్ యాదవ్,జనరల్‌సెక్రటరీ రంజిత్‌గౌడ్,ట్రెజరర్ చంద్రశేఖర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని సందడి చేశారు.

యువతి అదృశ్యం

కీసర, మార్చి 9: యువతి అదృశ్యమైన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..కీసరలోని స్నేహకాలనీకి చెందిన ముదునుమాల వసంత కృష్ణ కుమార్తె హరిత (19) నగరంలోని ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఈనెల 7న ఉదయం ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఆమె తండ్రి వసంత కృష్ణ కళాశాలకు ఫోన్ చేసి అడుగగా ఉదయం నుంచి కళాశాలకు రాలేదని చెప్పారు.ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. తండ్రి వెంటనే కీసర పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే 95425 96298, 8121059897, 7075896298 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పోలీసులకు ఇరు వర్గాల ఫిర్యాదు

పోచారం,మార్చి9: పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడలో ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ, ఓ హాస్టల్ నిర్వాహకుడి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురు పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు,హాస్టల్ యజమాని ఆరుట్ల రాజిరెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం .. పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్ సమీపంలోని సీబీసీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి ఎక్సైజ్ పోలీసుల అనుమతితో మద్యం పార్టీ జరిగింది.ఇది పరిశీలించడానికి రాత్రి ఎక్సైజ్ సీఐ రవి తన సిబ్బందితో వెళ్లారు. అదే సమయంలో మందుపార్టీ నిర్వాహకులు పటాకులు కాలుస్తుండగా ఓ రాకెట్ వెళ్లి పక్కనే ఉన్న రెడ్డీ గర్ల్స్ హాస్టల్ భవనంపై పడింది.దీంతో భవనం గ్లాస్ ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో హాస్టల్ నిర్వాహకుడు ఆరుట్ల రాజిరెడ్డి ఫంక్షన్‌హాల్ సెక్యూరిటీ సిబ్బందితో గొడవకు దిగారు. అదేసమయంలో సివిల్ డ్రెస్‌లో అక్కడికి వెళ్లిన ఎక్సైజ్ సిబ్బందిని గుర్తు పట్టకుండా వీరంతా ఫంక్షన్ వస్తున్నారనుకొని రాజిరెడ్డి వారిని ఫక్షన్‌హాల్‌లోపలికి వెళ్ళనివ్వలేదు.దీంతో ఎక్సైజ్ సీఐ,సిబ్బంది హాస్టల్ నిర్వాహకుడితో వాగ్వాదం జరిగింది. దీంతో రాజిరెడ్డిని ఎక్సైజ్ పోలీసులు జీపు ఎక్కించి ఫంక్షన్ హాల్‌లో కూర్చో బెట్టగా హాస్టల్ విద్యార్థులు మా యజమానితో గొడవ పడతారా అని ఫంక్షన్ హాల్ గేటు వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోచారం పోలీసులు అక్కడి చేరుకొన్నారు.అనంతరం హాస్టల్ నిర్వాహకుడు ఆరుట్ల రాజిరెడ్డి, ఎక్సైజ్ సీఐలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆస్తిపన్ను బకాయిలు చెల్లించండి

మలక్ పేట, మార్చి 9: ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైం సెటిల్మెంట్ కింద ప్రభుత్వం 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ జీవో జారీ చేసిందని సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు గడువు ఉన్నదని బకాయిలు చెల్లించాలని సూచించారు.